క్లుప్తంగా

పేదలకు అన్నదానం



లక్కవరంలో భోజనాలు వడ్డిస్తున్న యువకులు

చింతపల్లి: మండలంలోని కిటుముల పంచాయతీ లక్కవరంలో ఆదివారం సేవా సంఘం, హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెల రెండవ వారంలో ఏదో ఒక గ్రామంలోని పేద గిరిజనులకు అన్నదానం చేయడం వీరి ఆనవాయితీ. కార్యక్రమంలో భాగంగా విద్యా ప్రాముఖ్యత గురించి డిగ్రీ కళాశాల వార్డెన్ గసాడి తిరుపతి బాబు విద్యార్థులకు అవగాహన కల్పించి పుస్తకాలను పంపిణీ చేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై విమర్శలు తగవు



పుష్పలత

చింతపల్లిరూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై టీడీపీ నాయకులు విమర్శలు చేయడం తగదని చింతపల్లి మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత అన్నారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సేవలందిస్తుంటే కొందరు టీడీపీ నాయకులు కార్యక్రమంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ నేతలకు చంద్రబాబు ఆరోగ్యం తప్ప ప్రజల ఆరోగ్యం పట్టకపోవడం దారుణమన్నారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జగనన్న ప్రభుత్వంపై టీడీపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు గమనిస్తున్నారని, వారికి మరోసారి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

నేడు నెల్లిపూడిలో గడపగడపకు

గంగవరం : మండలంలోని నెల్లిపూడి గ్రామంలో సోమవారం నిర్వహించనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు హాజరవుతున్నట్టు పార్టీ నాయకుడు తోట రాజేశ్వరరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నేడు సాయిబాబా మందిర వార్షికోత్సవం



షిర్డీ సాయిబాబా మందిరం

రాజవొమ్మంగి: మండలంలోని శరభవరం గ్రామంలో గల షిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్టు కమిటీ చైర్మన్ జి.ఎస్.ఎన్.రాజు(శ్రీను) తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 5.15 గంటల నుంచి ఆలయం వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. 8 గంటలకు సాయిబాబా వారికి ఉచిత సామూహిక సత్యవ్రతాలు, 10 గంటలకు చందనోత్సవం, 12 గంటలకు మధ్యాహ్న హారతి, ఒంటి గంట నుంచి బాబా వారికి పల్లకీసేవ, అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొవాలని కోరారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు జల్లిపల్లి మూర్తి, తదితరులు

ముంచంగిపుట్టు: మండలంలోని కర్రిముఖిపుట్ పంచాయతీ వెచ్చంగి గ్రామంలోని రూ.5లక్షల జిల్లా పరిషత్ నిధులతో సీసీ రోడ్డుకు ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు జల్లిపల్లి మూర్తి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోని గిరిజన గ్రామాలు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయన్నారు. అలాగే కర్రిముఖిపుట్ గ్రామంలోని జెడ్పీ నిధులతో రెండు చెక్‌డ్యాంల పనులు చేయించినట్లు తెలిపారు. నాయకులు అర్జున్, దామోదరం, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన దుర్గమ్మ

- దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- దుర్గాదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- భక్తులతో కళకళలాడిన అమ్మవారి ఆలయాలు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు



జి.మాడుగులలో అమ్మవారికి భక్తులతో కలిసి పూజలు చేస్తున్న సీఐ సత్యనారాయణ

చింతపల్లి: అల్లూరి జిల్లా వ్యాప్తంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.. అమ్మవారి ఆలయాలు చక్కగా ముస్తాబయ్యాయి. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు ఆలయాలకు పెద్ద ఎత్తున చేరుకుని అమ్మవారికి పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. విద్యుద్దీప కాంతులతో దుర్గాదేవి ఆలయాలు ప్రకాశవంతంగా దర్శనమిచ్చాయి. దుర్గమ్మ పాహిమామం..అంటూ అమ్మవారి నామ స్మరణంతో గ్రామాలు మార్మోగాయి. అమ్మవారి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. చింతపల్లి మండల కేంద్రంలోని రంగా సెంటర్ వద్ద అమ్మవారి భారీ విగ్రహం ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారి విగ్రహం వద్దకు సారెతో తరలివచ్చారు. భవానీ మాలధారులు, భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతర్లలో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, వర్తక సంఘం నాయకుడు బేతాళుడు, పి.వినాయకరావు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు(బుజ్జి) ,వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఎస్.మత్స్య కొండంనాయుడు, భవానీ మాలధార భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న దంపతులు

కొయ్యూరు: దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం కావడంతో మండల కేంద్రంలోని భవానీ మాలధారులు గరగలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గరగలను దుర్గమ్మ ఆలయం వద్దకు చేర్చారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సర్పంచ్ మాకాడ బాలరాజు, కమిటీ సభ్యులు అనిశెట్టి చిరంజీవి, మేడిబోయిన్ చిన్న, మాకాడ లక్ష్మి, సరస్వతి, మొట్టడం వీరయ్యదొర తదితరులు పాల్గొన్నారు.

ఉబ్బల అప్పారావు, భానుమతి దంపతులు, ఉబ్బల రజేశ్, దుర్గ దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మకాడ రాజశేఖర్ అమ్మవారి ప్రతిమను ఏర్పాటు చేశారు.

సీలేరు: సీలేరు మార్కెట్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు.

సీలేరు ఎస్‌ఐ రామకృష్ణ , సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ పి.సురేష్ , సర్పంచ్ దుర్గో ,ఉ ప సర్పంచ్ వల్లీ ప్రసాద్, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు. వానపల్లి అప్పారావు ఆధ్వర్యంలో అమ్మవారి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

అడ్డతీగల: అడ్డతీగలలో ఆదివారం శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.పవనగిరి క్షేత్రంలో తొలిరోజు కలశస్థాపన కార్యక్రమాన్ని చేసి శ్రీగిరి దుర్గా భవానీ అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజాధికాలు నిర్వహించారు.అంతకుముందు అమ్మవారికి అభిషేకం, సహస్రనామార్చన, శ్రీ చక్రార్చన,శివాభిషేకం జరిపారు.అమ్మవారికి కట్టుపొంగలి, పులిహోరని నివేదన గావించారు. పూజాధికాల్లో పాల్గొన్న మహిళా భక్తులకు రవికెలు, గాజులు, తాంబూలాన్ని పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య, విజయలక్ష్మి దంపతులు అందజేశారు. అన్నప్రసాద వితరణ చేశారు.స్థానిక దేవీ ఆలయంలోని కనకదుర్గ అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజాధికాలు నిర్వహించారు.భ క్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

గంగవరం : మండలంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారి జాతర మహోత్సవాలు, దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైయ్యాయి. అమ్మవారి విగ్రహాన్ని, కలశాన్ని స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం నుంచి పురవీధుల్లో ఊరేగించి, అమ్మవారి ఆలయానికి చేర్చారు. రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో విశేష కుంకమ పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలు ఈ నెల 24 వరకు నిర్వహిస్తామని ఈ సందర్భంగా రోజు అమ్మవారికి కుంకమ పూజలు జరుగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఎటపాక: శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం మండలంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని మురుమూరు, తోటపల్లి, గుండాల, పురుషోత్తపట్నం గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో కనకదుర్గమ్మ అమ్మవారిని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రులు సందర్భంగా అమ్మవారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. మొదటి రోజు మండపాల వద్ద బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.



గుండాలగ్రామంలో కొలువుదీరిన అమ్మవారు



దేవీ ఆలయంలో కనకదుర్గ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



చింతపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు

జోరుగా వ్యవసాయ పనులు



వరిలో కలుపు తీస్తున్న వ్యవసాయ కూలీలు

- కలుపుతీత పనులు పూర్తి
- కళకళలాడుతున్న వరిపొలాలు

రాజవొమ్మంగి: ఖరీఫ్ వరి సాగులో అతి కీలకమైన ఘట్టం కలుపు తీత. కాగా వరి నాట్లు పడి రెండు నెలలు దాటి పోవడంతో రైతులు కలుపు తీత పనులు వడివడిగా పూర్తి చేస్తున్నారు. కలుపు తీసిన పొలాల్లో రెండో దఫా ఎరువులు వెదజల్లడం కూడా పూర్తి కావడంతో వరి పొలాలు నేడు ఎక్కడ చూసినా పచ్చగా కళకళలాడుతు కనుపిస్తున్నాయి. వాతావరణంలో అసమానతలు, ఒకసారి అధిక వర్షాలు, మరో సారి వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది నాట్లు కొంత ఆలస్యంగా పడ్డాయి. అయితే నేడు అన్ని చోట్ల నాట్లు పూర్తికావడంతో పొలాలు పచ్చగా దర్శనమిస్తున్నాయి. అయితే వరి దుబ్బులతో పాటు ఒత్తుగా, ఎత్తుగా పెరుగుతున్న పిచ్చిమొక్కలు భూసారాన్నంతటిని హరించి పంట నష్టం కలిగిస్తాయని, కలుపు వల్ల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుందని రాజవొమ్మంగి వ్యవసాయాధికారి రమేష్‌నాయుడు అన్నారు. వరి నాటిన నెల పదిహేనురోజుల్లో కలుపు నివారణ చేపట్టి వరి పంటను కాపాడుకోవాలని ఆయన సూచించారు. కలుపు వల్ల రకరకాల తెగుళ్లు, పురుగులు ఆశిస్తాయన్నారు. ఈ మేరకు వరి పంటలో కలుపు నివారణకు రసాయనాలు వినియోగించొద్దని సూచిస్తున్నారు. వరి పంటపై రసాయన పురుగుల మందుల వినియోగంతో పర్యావరణంతో పాటు భూసారం దెబ్బతింటోందన్నారు. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో పంటల్లో కలుపుతీత పనులపై మొగ్గుచూపుతున్నారు. ఎకరాకు రూ.3వేలు అదనపు ఖర్చు అవుతున్నట్టు పలువురు రైతులు చెబుతున్నారు.ఇదిలా ఉండగా జిల్లా వరి సాగు సాధారణ విస్తీర్ణం 58, 404 హెక్టార్లు కాగా ఈ ఏడాది 50,342 హెక్టార్లలో నాట్లు పడ్డాయని జిల్లా వ్యవసాయాధికారి నంద్ తెలిపారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 47, 821 హెక్టార్లలో ఈ–క్రాప్ నమోదు పూర్తయిందన్నారు. ఈ–క్రాప్‌తో పాటు రైతులు ఈకేవైసీ కూడా పూర్తి చేసుకోవాలని డీఏఓ నంద్ కోరారు.

తపాలా సేవలపై అవగాహన

అడ్డతీగల: ప్రభుత్వ పథకాలకు అర్హత పొందడానికి అనువుగా పోస్టల్ శాఖ సిబ్బంది గ్రామాల్లో పోస్టల్ ఖాతాలు తెరుస్తున్నారు. ఇన్ యాక్టివ్ ఆధార్ కేసుల వల్ల అడ్డతీగల మండలం దుశ్శర్తి, దాకోడు, డి.రామవరం పంచాయతీల్లో అర్హత ఉన్నప్పటికీ పలు ప్రభుత్వ పథకాలకు పలువురు రైతులు, ఇతరత్రా వర్గాల ప్రజలు అర్హత కోల్పోతున్నట్టు గుర్తించారు.ఈ సమస్యను తొలగించి అన్ని ప్రభుత్వ పథకాలకు అర్హత ఉండేలా ఆయా ఇన్‌యాక్టివ్ ఆధార్ కేసులుగా ఉన్న వారికి పోస్టల్ ఖాతాలు ప్రారంభిస్తున్నారు. అనర్హులుగా ఉన్న ఆయా పంచాయతీల్లోని 50 మంది రైతులు ఇతర లబ్ధిదారులకు పోస్టల్ ఖాతాలు ప్రారంభించారు.



దుశ్శర్తిలో రైతులకు పోస్టల్ సేవలను వివరిస్తున్న సిబ్బంది

ఈనెల 13 నుంచి పంచాయతీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. గిరిజన సంక్షేమశాఖ పీఎంయూ చంద్రకళ, పోస్టల్ సిబ్బంది, పంచాయతీ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లు ,గ్రామ ఉద్యాన సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో హోటల్ దగ్ధం

రాజవొమ్మంగి: మండలంలోని లాగరాయి గ్రామంలో శనివారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో రేకులషెడ్డులో గల హోటల్ షెడ్డు పూర్తిగా దగ్ధమైంది. దీంతో టీ, టిఫిన్ హోటల్‌తో జీవిస్తున్న ముల్లేటి అప్పారావు, లక్ష్మి దంపతులు ముగ్గురు పిల్లలతో వీధినపడ్డారు. తమ ప్రధాన జీవనాధారమైన హోటల్ కాలిపోవడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొందని బాధితులు వాపోయారు. గ్రైండర్, ఫ్రిడ్జి, ఫర్నీచర్ తదితర సామగ్రి, ఆహార దినుసులు పూర్తిగా కాలిపోయాయి. ఆస్తి నష్టం సుమారు రూ.2లక్షలు ఉంటుందని అంచనా. సర్పంచ్ మిరియాల గణలక్ష్మి, వీఆర్వో ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం తరపున తక్షణ సాయంగా నిత్యావసర సరకులు అందజేశారు. తమను ఆదుకోవాలని బాధిత కుటుంబం ఉన్నతాధికారులు, ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



బాధిత కుటుంబం

స్ఫూర్తి ప్రదాత అబ్దుల్ కలాం



అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



హుకుంపేటలో అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

సాక్షి,పాడేరు: భారత రత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ పీవోలు రమేష్, గౌరీశంకరరావు, ఇతర విద్యార్థులంతా డాక్టర్ అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పెనుమాక రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సల్లా రామకృష్ణ తదితరులు జిల్లా ఆస్పత్రిలోని ప్రసూతి విభాగంలోని గర్భిణులు, బాలింతలకు పాలు,రొట్టెలను పంపిణీతో సేవా కార్యక్రమం నిర్వహించారు.

హుకుంపేట: భారత అణు పితామహుడు, మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపిజే అబ్దుల్‌కలాం జయంతిని మండ కేంద్రంలో స్థానిక ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల వద్ద వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియ జిల్లా కన్వీనర్ తెడబారికి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు చిన సత్యం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గిరి గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



బాకురులో స్థానికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, చిత్రంలో ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం

- అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: గిరిజన గ్రామాలభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ,గ్రామల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలతో పాటు మౌలిక సదుపాయల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేకంగా సారించినట్టు అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని బాకురు పంచాయతీ కేంద్రంతో పాటు కరకలవలస, గొర్లెకుడ్డా, వై.బాకురు, గొప్పులపాలెం, కోటగుమ్మం గ్రామల్లో స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు.

కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 414 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులకు ఆయన పూలమాలతో హారతిలిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. రోడ్లు, డ్రైనేజీల సమస్యను గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించగా, ఆయన తక్షణమే స్పందించారు. ఇంజినీరింగ్ అధికారులకు ఫోన్ చేసి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, ప్రతిపాదనలు తయారుచేయాలన్నారు. ప్రభుత్వం పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాకురు నుంచి గొర్లేకుడ్డా గ్రామం వరకు రహదారి సౌకర్యం సరిగ్గాలేదని గ్రామస్తులు విన్నవించగా గడప గడప నిధులు రూ.10లక్షలు, సొంత నిధులు రూ.8లక్షలు, మండల ప్రజాపరిషత్ నిధులు రూ.5లక్షలు మొత్తం రూ.23లక్షలు వెచ్చించి సీసీ రోడ్డు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. కొద్ది రోజుల్లోనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడతామన్నారు. మండలంలోని పంచాయతీల అభివృద్ధికి రూ.9కోట్లుతో పథకాలు అందించామన్నారు. గ్రామాల్లో సమస్యలను తనకు తెలియజేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం, మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జేసీయస్ మండల ఇన్‌చార్జి కె.రామకృష్ణ,, సర్పంచ్‌లు బాకురు వెంకటరమణ, కాకరి బొంజుబాబు, సీదరి సాంబ, దూసురు పద్మకుమారి, ఎంపీటీసీలు నైని రజని, కొర్ర నాగరాజు, కె.నాగలక్ష్మి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు శోభ ధర్మయ్యదొర, యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు, నాయకులు బాకురు సదాశివరాజు,భూషణ్,వెంకట్, కోరాబు వెంకట్, లఖమయ్య, లంబన్న, చిన్నయ్య, కోటిబాబు, రమేష్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్‌పై ఎంపీపీ సమీక్ష నేడు

అనంతగిరి: మండలంలోని జల్‌జీవన్‌మిషన్‌లోని జరుగుతున్న పనులపై ఎంపీటీసీ, సర్పంచ్‌లతో సమీక్ష సమావేశం సోమవారం ఎంపీపీ శెట్టి నీలవేణి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ గౌతమ్ తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు తప్పనిసరిగా పాల్గొవాలన్నారు.

గోంగూరపూలు కనువిందు



సాక్షి,పాడేరు: తెల్ల గొంగూర మొక్కలకు వైలెట్ రంగులో వికసించిన పూలు చూపరులను ఎంతో ఆకర్షిస్తున్నాయి. పాడేరుకు సమీపంలోని నక్కలపుట్టు ఆర్ అండ్‌బీ రోడ్డు పక్కనే తెల్లగొంగూర మొక్కలు ఉన్నాయి. ఇక్కడ మొక్కలకు ప్రస్తుతం వైలెట్ రంగులో పూలు విరగ్గాసాయి. ఎంతో అందంగా, ఆకర్షణీయంగా ఉన్న ఈ మొక్కల వద్ద స్థానికులు, పర్యాటకులు ఫోటోలు తీసుకుంటున్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు శిక్షణ



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కశింకోట: కశింకోటలో స్పందించే హృదయం సంస్థ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాజరయ్యే 8వ తరగతి విద్యార్థులకు ఆదివారం ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభమైంది. స్థానిక ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో జరిగిన శిబిరంలో సంస్థ ఉపాధ్యక్షుడు ఆచంట నాగేశ్వరరావు మాట్లాడుతూ దసరా సెలవుల్లో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు అవసరమైన శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వం, మనో సామర్థ్యం పెంపుదలపై శిక్షణ ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆడారి సంజీవరావు మాట్లాడుతూ మనో సామర్థ్యంపై ఇచ్చే శిక్షణ విద్యార్థులకు విద్యా సంబంధిత అంశా ల్లో కూడా దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డి.నూకేష్, ఎస్.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశుని సన్నిధిలో గీతా ప్రవచనాలు

కశింకోట: గవరపేటలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో లింగరామేశ్వరరావు భగవద్గీత ప్రవచనాలు ఆధ్యాత్మిక సౌరభాలు వెదజల్లుతున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ భీశెట్టి దుర్గానాగేశ్వరావు ఆధ్వర్యంలో గీతా ప్రవచన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. రోజూ సాయంత్రం పూట నిర్వహిస్తున్న ప్రవచన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై, విని తరిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం

రాజవొమ్మంగి: స్థానిక శ్రీ అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 1997–98 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. వారు ఏర్పాటు చేసుకొన్న ఈ కార్యక్రమానికి సుదూర ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు వచ్చారు. కార్యక్రమంలో భాగంగా అప్పటి గురువర్యులు టీవీ. శర్మ, బీఎస్. కుమార్, విజయలక్ష్మి, సువర్ణ, ఇమ్మానియేలు, వెంకటేశ్వరరావు, వీరభద్రరావు, మోహన్, అప్పారావులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాసాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎన్నో ఏళ్ల తరువాత పాఠశాలలో కలుసుకొన్న పూర్వ విద్యార్థులు పాతజ్ఞాపకాలను నెమరు వేసుకొంటూ సరదా సరదాగా రోజంతా గడిపారు. దీంతో పాఠశాలలో సందడి నెలకొంది. కార్యక్రమాల్లో భాగంగా తొలుత పాఠశాల ఆవరణలో గల శ్రీఅల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



సమావేశానికి విచ్చేసిన పూర్వ విద్యార్థులు